

బలివాడ కాంతారావు

# నూతన వ్యవస్థ

వెంకటరంగం మేష్టారంటే ఇంకా పెద్దముక్కు ఖద్దరుదుస్తులతో మన్న ఆజానుబాహువైన విగ్రహమే శంకరం కళ్ళముందు ఉంది. మేష్టారు పెట్టుకున్న నియమాలు దాటకుండా నిష్ఠతో జీవితాన్నిగడిపి, ఆ తక్కువ ఆర్జనతో బిడ్డలను చదివించాడు. వాళ్ళని అదుపాజ్ఞనలలోనే ఉంచాడు. అతనిచే మొట్టికాయలుతిన్న విద్యార్థులలో తనూ ఒకడు.

శంకరం ఏదో గది ఖాళీగా ఉందంటే అద్దెకు అడుగుదామనివచ్చి చూస్తే మంచంమీదను జ్వరంతోపడున్న వ్యక్తి వెంకటరంగం మేష్టారు! తను చదువు

కునే రోజుల్లో మేష్టారికి స్వంత ఇల్లు లేదు. శంకరం ఊరూర్లూతిరిగి ఉద్యోగ రీత్యా మళ్ళీ యీ ఊళ్లో కాలుపెట్టి రెండుహోటళ్లు మార్చి ఈయన ఇంటి దగ్గరే కాలుపెట్టాలా?

మేష్టారు బాగా చిక్కిపోయి ఉన్నారు. లోతుకు పోయినకళ్లు, అభిమానమనే కన్నీటితో ఒక్కసారి తేలిపోయాయి. ఆరుపదులు దాటిన జీవితం మోపిన బరువుభారంతో క్రుంగుతూ మూల్గినమూలుగు మరో క్షణంలో వినిపించింది. ఆనందంతో ముదిమిని గడపడానికి అనువుగా బరువును తమ భుజాలపై వేసుకోగలిగే బిడ్డలుండగా మేష్టారింతగా చితికిపోయారేం? శంకరం ఒక్కసారి ఇంటిచుట్టూ చూసాడు. అంగట రెండుగదులు, పెరటవరండా. వరండాకు వంటగదికీ మధ్య గచ్చునేల. వంటయింట్లో మేష్టారి చిన్నకూతురు వండుతోంది. పెరటి వరండాలో ఒకామె కూర్చుంది. ఆమె చాలా నీరసంగాఉంది. ముగ్గురుపిల్లల్లో కుర్రాడు తాతదగ్గర నిల్చున్నాడు. మిగతా ఇద్దరూ ఆడపిల్లలు; చేతిపిల్ల యేడుస్తోంది. ఆమె మేష్టారి పెద్దమ్మాయని పోల్చుకున్నాడు.

ఆ పరిస్థితిలో ఇంకే ప్రశ్నలూ వెయ్యకుండా తనెందుకువచ్చాడో చెప్పాడు. మేష్టారు సంశయించడానికి గల రెండు కారణాలు శంకరంకి తెలుసుకానీ అవసరం. "మీ కెటువంటి యిబ్బంది కలుగనివ్వనని హామీ ఇస్తున్నాను – కాదనకండి."

"సరే! ఈవేళ మంచిది. దిగిపోకూడదూ?" అన్నారు.

శంకరం ఆవేళనే అంగటి రెండు గదుల్లో ఒకగదిలో దిగిపోయాడు. మరుచటిరోజు రాత్రిసరికి ఇంకా జ్వరం తగ్గలేదు. హోటల్లో భోజనంచేసి ఇంటికి వచ్చేసరికి జ్వరతీవ్రతతో మేష్టారు రాగాలుతీస్తున్నారు. శంకరం అతని దగ్గరగా కూర్చొని చూసేసరికి శరీరం బాగా కాలిపోతోంది. తడిగుడ్డను నెత్తిమీదవేసి ఇంకో తడిగుడ్డతో శరీరాన్ని ఒత్తుతుంటే మేష్టారు ఏవేవో అనుకుంటున్నారు. జ్వరతీవ్రత తగ్గాక శంకరంవేపు చూసి కళ్ళు తుడుచుకుంటూ "ఈరోజు ఎండా కాలం–రేపు శీతాకాలం–నేను చచ్చేక ఈ కట్టెను ఎవడు ముట్టుకుంటేనేం?"

మేష్టారు పడుకున్నాక శంకరం తన గదిలోనికి వచ్చేసాడు. చాల రాత్రివరకు ఈ మాటలు తనను కలవర పరుస్తున్నాయ్. మేష్టారు ప్రోవిడెంటు ఫండుతో ఈ ఇల్లుకొన్నారు. శక్తి వున్నన్నాళ్ళూ ప్రైవేట్లు భుక్తికోసం చెప్పారు. హేమాహేమీల్లాంటి ఆర్జిస్తున్న ముగ్గురుకొడుకు లుండగా అతనింతగా బాధపడ్తున్నారెందుకు? భార్య గతించి అప్పుడే పదేళ్ళయింది.

ముసలికాలంలో ఇల్లాలు లేకపోతే ఒంటికాలు మనిషిలా బ్రతకాలి.

వారంరోజులసరికి శంకరం ఇంచుమించు వాళ్ళ ఇంటిమనిషిలా అయిపోయాడు. వద్దన్నా మందు తెచ్చి ఇవ్వటంవలన మేష్టారు కోలుకున్నా ముఖంలోని ఒక్కో ముడతలో ఒక్కో పరాభవం తొంగిచూస్తున్నట్లుంది. ఇల్లు కదలకుండా మంచంమీదనే ఉంటున్నారు

"మీ పెద్దమ్మాయికి మందు..."

మేష్టారు నవ్వారు. ఆ నవ్వు జీవితంపై విరక్తి వలన వచ్చినది.

"పెళ్ళిచేశాను. ముగ్గురుపిల్లల తల్లయింది. కానీ ఆ మొగుడికి పెళ్లాన్ని ఎలా చూడాలో తెలీదు. అదొక మనిషన్న కనికరమైనాలేదు. ఆస్తి తగలేసాడు. తాగుడు. అడగలేను - అడక్కుండా ఉండలేను. దానిని కేన్సరు జబ్బుతో నా యింట్లో పిల్లలతో వదిలేసాడు. వాడికి బరువని-కన్నప్రాణం- నాకు బరువా?"

"పోనీ - అన్నదమ్ములు సహాయం చేస్తే మెడ్రాస్ తీసుకువెళ్తే బాగుణ్ణేమో?"

"అయ్యో! అంత అదృష్టమా? దీనిని ఇంట్లో పెట్టాననీ, దానివల్ల అల్లుణ్ణి మరింత పాడుచేస్తున్నానని నా యింట్లో అడుగుపెట్టడమే మానేసారు"

"ఏమిటీ? మీరంటే గజగజవణికే మీ అబ్బాయిలు...మీకు యెదురాడుతున్నారా?"

"సానుభూతికోసంకాదు. చెప్పుకుంటే కాస్త గుండెలో బరువు తగ్గుతుందని చెప్తున్నాను. పెళ్ళిళ్ళుకాగానే వీళ్ళిలా జంటజంటలుగా ఎగిరిపోతారని కలలోనైనా అనుకోలేదు. వాళ్ళ క్రింద ఖర్చుపెట్టినట్లే ఈ చిన్నమ్మాయి క్రిందా ఖర్చుపెట్టేవాడిని. వాళ్ళమీద ఆశతో దీని గొంతుక కోసాను."

చిన్నమ్మాయి సరస్వతి వంటయింట్లోనించి ఈ మాటలు వింటోంది. ఒంట్లో విజృంభించిన యౌవ్వనం మెరుగులు పెట్టుకోనట్లేవుంది. కళ్ళల్లో విచారం పొరలుగామారి ఆ తళుకును కప్పేసింది. అలంకరణ, ఆభరణాలూ నోచుకోలేని అతివఅందమంతా మబ్బుతెర కప్పిన వెన్నెల్లా అగుపిస్తోంది. నీలికొండలచాటున దాగున్న దినకరునిలా మండుకపోతున్న మనిషి బయటకు ప్రశాంతంగా కనిపిస్తోంది.

"ఆడపిల్లకు పెద్దచదువు లెందుకని తెలివిగా చదువుతున్నా ఆపేసాను. ఇదే ఒక డాక్టరై వుంటే నాకీ బాధ వుండేదా? చదువు ఆపి, చిన్నపెళ్ళి చెయ్యలేకపోయాను. చదివించి దాని పెళ్ళి అది చేసుకోగలిగే సమర్థతకు దూరంచేసి వంటయింటి కుందేల్ని చేసాను."

"మీ పెద్దబ్బాయి మంచి ఉద్యోగంలో ఉన్నాడుకదా...ఈ మాత్రం బాధ్యత తీసుకోలేకపోయాడా ?"

"పెళ్ళిళ్ళుచేసాక తెలుసుకున్నా - యీ ముగ్గురికొడుకులపై నాకేం అధికారంలేదని. ఇదివరలా మందలించబోతే నేనే తిరిగి మాటలుపడే అవస్థ వచ్చింది. పెద్దకోడలు మామగార్ని లోపలికిరమ్మనదు. పెద్దకొడుకు పెద్ద మాటలు నేర్చాడు. ఏదో కసి తీర్చుకున్నట్లు మాట్లాడుతాడు. రెండోవాడు ఒక అమ్మాయిని ప్రేమించాడు. కట్నం పుచ్చుకోలేదు. అత్తారివాడయ్యాడు. మూడోవాడిచదువు సాగలేదు సరిగ్గా. వాడు తెచ్చుకున్నది వాడి కుటుంబానికే చాలదు. ఇంటిమీద అప్పుతెచ్చి తింటున్నాను. ఇంక కూతురి పెళ్ళేమిచ్చి చేస్తాను?"

"ఏమైనా సంబంధాలు వస్తున్నాయా?"

"ఏవో వచ్చాయ్. అన్నీ హిరణ్యాక్షవరాలు. పదివేల కట్నం. పానకంబిందెలు, వెండిగిన్నెలు, పట్టుపంచెలు. నలుగురు ఆడపడుచులకు మంగళ హారతికి నాలుగువందల పదహార్లు...నడుంవిరిగి కొడుకులు దగ్గరకువెళ్తే... మన తలకు సరిపడ్డది చూసుకోవా అన్నారు ... పెద్దవాడు ఇంకోటికూడా అన్నాడు. ఏదో రెండో పెళ్ళి సంబంధం చూడండి - చవగ్గా వస్తుందన్నాడు. ఒరే, నీ కిది న్యాయంరా? - అంటే ... ఇరవై మూడేళ్లు దాటాయికదా..,తప్పేంటి అన్నాడు. తలమీద కండువా వేసుకుని వచ్చేసాను."

"అయితే ఏ కొడుకూ మీ కేం పంపించటంలేదా ?"

"వాళ్ళ సాయమేవుంటే మందు లేకుండా మంచంమీద పడుంటానా?"

"పెద్దవాడు బాగా సంపాదిస్తున్నాడు కదా - వెళ్ళి వాళ్ళ పై ఆఫీసర్ని కలవలేకపోయారా? అమ్మాయి పెళ్ళికి సహాయం దొరికేదేమో ?"

"మొదట్లో కోపంతో ఆ ఆఫీసర్నే కలిశాను. అత నేమన్నాడో తెలుసా? "మీ బాధలకు సానుభూతి చూపించి మీ కుమారునితో చెప్పగలను. వినటం తనయిష్టం." "ఒకప్పుడు వినకపోతే?" అని అడిగాను. "మేం యేమీ చెయ్యలేము. ఎంచేతంటే కుటుంబం అంటే భార్య, పిల్లలు. వాళ్ళను పోషించక పోతే మేం జోక్యం చేసుకోగలం, కానీ మీరు కుటుంబంలో మనిషి కారు" ... ఒళ్ళుమండి నేనూ అనేశాను."

"ఏమని?''

"ఈ దేశంలో - అతిథుల్ని కుటుంబంలో మనుషుల్లా చూసుకునే సంస్కృతి ఎప్పుడు మంటగలిసిపోయింది? ఏనాడో రాముడికి సహాయం చేశాయని కోతుల్ని చంపకూడదన్న

మన కనికరం యెక్కడకు పారిపోయింది? ఇహలోకం గురించేకాక పరలోకం గురించి యెక్కువగా తాపత్రయపడే మనధర్మం యేమైంది? ఈ జాతిరక్తం యింతగా యేనాడూ కలుషితంకాలేదు. ఫేమిలీ అంటే పెళ్ళాం, పిల్లలట-కాళ్ళుచేతు లున్నవాళ్ళంతా ఒకే ఫేమిలీ...ఒకే ఫేమిలీ" అని అరుస్తూ వచ్చేశాను.

"పర్యవసానం?"

"పెద్దకొడుకు ఇదివరకు నెలకు యిస్తుండిన ముప్ఫయిరూపాయల భరణంకూడా ఆపేశాడు."

"అప్పు డేం చేశారు?"

"ఏం చేస్తాను? నేను పాతవాడిని. పాతవ్యవస్థలోని ఆలోచనలతో యీ కొత్తమనుషుల క్రొత్తవ్యవస్థలో నిల్చోలేక కుత కుత వుడికిపోతున్నాను. ఉమ్మడికుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైపోయింది."

"అది సమర్థిస్తారా?"

"నేను సమర్థించనంత మాత్రాన అది నిల్చిపోదు. పాతనీరుమీద ఎక్కడినించో ఒకపొంగువచ్చి ప్రవాహమైంది. నేను ఆపినా ఆగిపోదు. ఏదో - నా కడుపుశోకంతో అరచినంత మాత్రాన-...విత్తనాలు మొలకెత్తకుండాపోవు. తెలివిగలవాణ్ణయితే ఆ మొక్కలను పెంచి వాటిఫలాలను అనుభవించవలసిందే!"

"మీ రలా అంటున్నారు, కానీ మీకు పాతమీది రుచిపోదు. మీకు భయం హెచ్చు."

మేష్టారు శంకరం మాటలువిని ఒకసారి తేరిజూశారు.

"అవును ... సంఘానికి భయపడొద్దా?"

"ఎవరా సంఘం?"

"నే నున్నది - నా చుట్టూ వున్నవారు."

"మీ కొడుకులతో సహా..."

కాస్సేపాగి "అవును."

"అయితే మీరు మిమ్మల్ని సహాయపడని సంఘానికీ, మిమ్మల్ని బాధపెట్టి చివరకు మ్రింగడానికి సంసిద్ధమైన సంఘానికీ భయంతో భీరువై కొలుస్తున్నా రెందుకు? సంఘనియమానికి అతిక్రమించటంవలన వచ్చే సంతోషాన్ని మీ రాహ్వానించ రెందుకు?"

"సంఘంలో బ్రతకాలని..."

"ఎలాగో సంఘంలో బ్రతికేబదులు ...ఈనాడు మనిషి ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో, నిజమని నమ్మిన సిద్ధాంతాలతో నాటిన మొక్కలు యేనాటికైనా పెద్దవై - అతను వాటి ఫలాలను అనుభవించకపోయినా - అభ్యుదయం అతనే సాధిస్తాడు."

మేష్టారు ఒకనాడు తను బెంచీ ఎక్కించిన శిష్యుడే ఈనాడు గురువు

గారికి బోధిస్తున్నాడని కామోసు-ఒక సారి శంకరంవేపు చూశారు. శంకరం బరువైన కళ్ళల్లో బ్రహ్మాండమైన వ్యూహాలు కదలుతున్నట్లున్నయ్. మేష్టారు యింకా శిష్యుణ్ణి తనకంటే గొప్పవానిగా తీసుకోడానికి యిష్టపడనట్లుంది.

"అబ్బాయ్! ఈ లోకం ఆరు పదులుపైబడి చూశాక నేను యిప్పుడొక్క నిర్ణయాని కొచ్చానోయ్. మనిషికి డబ్బుంటే యేదిచెప్పినా చెల్లుతుంది. డబ్బులేనివాడు సంఘంపెట్టిన నియమాలుదాటితే తప్పు. డబ్బున్నవాడు దాటితే అభ్యుదయం."

"మనిషికి డబ్బు అవసరంలేదని నేననలేను. కానీ డబ్బునే కొలబద్దను చేసి మనిషిలోని ధైర్య స్థైర్యాలను, త్యాగాన్ని, ఉత్సాహాన్ని కొలవటానికి నే నిష్టపడను. మీరు సుఖంగా వుండాలన్న మనోనిబ్బరం మీలోవుంటే వుండగలరు."

"ఎలా?"

"చెప్పనా?"

"చెప్పవోయ్."

"మీ దృష్టిలో నేను మీ కొడుకుల కంటే నయమేనా?"

"వాళ్ళతో పోల్చకు. నీ తల్లిదండ్రులు అదృష్టవంతులు."

"అయితే - మీకు మహదానందం, తృప్తీయిచ్చే ఏ పనిచెయ్యమంటారో నన్ను ఆజ్ఞాపించండి."

"నిజంగా శిరసావహిస్తావా?"

"మిమ్మల్ని నేను దేవుని గొప్పతనానికి చిహ్నంగా ఎంచుకున్నాను. దేవుని ప్రేమిస్తున్నట్టే మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. దేవుని కొలుస్తున్నట్లే మిమ్మల్ని కొలుస్తున్నాను. దైవకార్యం నెరవేర్చడానికి ప్రయత్నిస్తున్నట్లే మీకార్యం నెరవేర్చడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఆజ్ఞాపించండి."

"నాకు యీ ఆఖరిదశలో యేది మహదానందం - తృప్తి యిస్తుందో నీకు తెలుసునుగా...అదే చెయ్యి."

"కులానికి అతీతులై అభ్యుదయ మార్గంలో అడుగుపెట్టారు - నేను చాలా అదృష్టవంతుణ్ణి."

మేష్టారి వంగిన వెన్నుపూసలు తిన్నగా నిల్చున్నయ్. పొంచివింటున్న సరస్వతిలో ఆ క్షణంలోనే పెళ్ళికళలు తళుక్కున మెరిశాయ్.